క్లుప్తంగా

పంచాంగం ఆవిష్కరణ



నర్మెట: భాగ్యనగర అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో శ్రీక్రోధినామ సంవత్సర 2024–25 అష్టాక్షరి సేవాసమితి సహకారంతో ముద్రితమైన పంచాంగంను మండలకేంద్రంలోని కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా భారత అర్చక పౌరోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవడం హైందవుల ప్రధాన కర్తవ్యమని, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంత అభ్యున్నతిని సాధించినా పంచాంగాల ప్రత్యేకను ఎన్నటికీ కాదనలేమని శుభాశుభ కార్యక్రమాల్లో వాటి విశిష్టత వాటిదేనని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఉప్పలగిరి ప్రసాద శర్మ, ప్రధాన సలహాదారు గంగు సచ్చిదానంద మూర్తి, ఉపాధ్యక్షులు అన్నలాపురం ప్రమోద్ కుమార్ శర్మ, జిల్లా అధికార ప్రతినిధి రంగరాజు వెంకట రమణారావు, సభ్యులు ప్రయాగ నాగభూషణ శర్మ, కాచరాజు చంద్రశేఖర శర్మ పాల్గొన్నారు.

అన్నదమ్ముల మృతి బాధాకరం



కొడకండ్ల: సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మేటి రాములు రాజేశ్వరిల ఇద్దరు కుమారులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మేటి శ్రావణ్, శివల మృతదేహాలను సోమవారం గ్రామానికి తీసుకొచ్చిన వెంటనే ఆమె అక్కడకు చేరుకొని నివాళులర్పించి తల్లిదండ్రులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కొడకండ్ల, దేవరుప్పుల మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు సురేష్‌నాయక్, నల్ల శ్రీరామ్ నాయకులు సోమనర్సయ్య, వెంగల్‌రావు, పెదగాని సోమయ్య, రంగయ్య, యాకేష్ ఉన్నారు.

నీళ్ల ట్యాంకర్‌ను ఢీకొన్న లారీ

- ఇద్దరికి గాయాలు



బోల్తాపడిన వాటర్ ట్యాంకర్

స్టేషన్‌ఘన్‌పూర్: జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌పై మొక్కలకు నీరు పోస్తున్న నీళ్ల ట్యాంకర్‌ను వెనక నుంచి వస్తున్న లారీ అదుపు తప్పి ఢీకొట్టిన ప్రమాదంలో లారీ డ్రైవర్, ట్యాంకర్ డ్రైవర్ ఇద్దరు గాయపడ్డ సంఘటన ఘన్‌పూర్‌లో సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధి లోని ఇందిరానగర్‌కు చెందిన తాటికొండ వీరయ్య ట్యాంకర్‌తో రహదారిపై ఉన్న మొక్కలకు నీరు పోసే పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కొత్తపల్లి క్రాస్ రోడ్డు సమీపాన ఉన్న దాబా హోటళ్ల వద్ద జాతీయ రహదారిలోని డివైడర్‌పై ఉన్న మొక్కలకు రోజూ మాదిరిగానే నీళ్ల ట్యాంకర్ నెమ్మదిగా నడుపుతూ నీరు పోస్తున్నాడు. అదే సమయంలో రాయపూర్ నుంచి మధురై వైపు ఐరన్ లోడ్‌తో వెళ్తున్న లారీ ముందు టైరు పేలి అదుపుతప్పి నీళ్ల ట్యాంకర్ వెనకనుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ బోల్తాపడటంతో పాటు లారీ ముందు భాగం ధ్వంసమైంది. దాంతో ట్యాంకర్ డ్రైవర్ వీరయ్య, లారీ డ్రైవర్ జయరామన్ గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడకు చేరుకుని సీఐ ముస్కు రాజు, ఎస్సైలు నాగరాజు, వినయ్ స్థానికుల సాయంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హనుమకొండకు తరలించారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



రఘునాథపల్లి: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సోమవారం స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నిడిగొండ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాలీలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. తనిఖీ చేయగా వాహనంలో 16 క్వింటాళ్ల బియ్యం బస్తాలు ఉన్నాయి. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం దయ్యంబండతండా గ్రామానికి చెందిన వాంకుడోతు మహేందర్, వాంకుడోతు బుజ్జి ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రేషన్ బియ్యం విక్రయించినా, కొనుగోలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

ప్రాజెక్ట్ పనుల ప్రారంభమెప్పుడో?

- సాగునీరు లేక రైతుల ఇబ్బందులు
- భూమిపూజకే పరిమితమైన పనులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



సిస్టర్న్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే (ఫైల్)

తరిగొప్పుల: మండలంలో సాగునీటి కోసం మంజూరైన ప్రాజెక్టు పనులు ప్రారంభానికి నోచుకోకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరైన సాగునీటి వసతి లేకపోవడంతో వందల ఎకరాల భూమి నిరుపయోగంగా మారుతోంది. గత్యంతరం లేక ఆరుతడి పంటలతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. చివరకి వానస్తే పంట లేకుంటే లేదు అన్న పరిస్థితుల్లో అన్నదాతలు ఇక్కట్లు పడుతున్నారు. తరిగొప్పుల మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందించే దిశగా నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మండలంలోని బొత్తలపర్రె, బొంతగట్టునాగారం పరిధిలో రూ.67.5 కోట్ల అంచనా వ్యయంతో సిస్టర్న్ సంపు(ట్యాంక్) ప్రాజెక్ట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందుకు గానూ రూ.67.5 కోట్ల మంజూరు చేసింది. నర్మెట మండలం గండిరామారం రిజర్వాయర్ నుంచి తరిగొప్పుల మండలంలోని బొత్తలపర్రె వరకు పైపులైన్ ద్వారా నీటి ట్యాంక్‌లో ఎత్తిపోసి అక్కడి నుంచి పలు గ్రామాల్లో చెరువులు కుంటలను నింపి సాగునీరు అందించడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. తద్వారా మండలకేంద్రంతో పాటు అబ్దుల్‌నాగారం, నర్సాపూర్, సోలిపూర్, పోతారం, అంకుషాపూర్, బొత్తలపర్రె గ్రామాలలోని చెరువులు,కుంటలను నింపడం జరుగుతుంది. కాగా అప్పటి జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి గత ఏడాది సెప్టెంబర్‌లో ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందనగా ప్రాజెక్ట్ నిర్మాణానికి ఆగమేగాల మీద ఇరిగేషన్ ఉన్నతాధికారులతో కలిసి భూమి పూజ చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి కాంగ్రెస్ రావడం, నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందడంతో ప్రాజెక్ట్ నిర్మాణంపై నీలినీడలు అలుముకున్నాయని పలువురు వాపోతున్నారు. నెలలు గడుస్తున్నా సాగునీటి ప్రాజెక్ట్ పనులు ప్రారంభానికి నోచుకోకపోవడంతో రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికేడాది మండల వ్యాప్తంగా భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి సాగునీరు అందించాలని రైతులు ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతున్నారు.

భూగర్భజలాలు అడుగంటిపోయాయి



మండల పరిధిలో సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో రోజురోజుకు భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. నాలుగు ఎకరాలకు సాగునీరు అందించే బోరులో చుక్కనీరు లేకుండా పోయింది. ప్రాజెక్ట్ పనులు ప్రారంభించి మండల ప్రజలకు సాగునీరు అందించాలి.

– ముదావత్ గణేష్

రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి

జఫర్‌గఢ్/పాలకుర్తి/కొడకండ్ల: వరంగల్, ఖమ్మం, నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. జఫర్‌గఢ్, పాలకుర్తి, కొడకండ్ల మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు మాట్లాడారు. జెడ్పీ ఫ్లోర్ లీడర్ పుస్కూరి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ సుందర్‌రాంరెడ్డి, మండలాల అధ్యక్షులు పల్లెపాటి జైపాల్‌రెడ్డి, పసునూరి నవీన్, సిందె రామోజీ, పేరం రాము, సోమరెడ్డి, పెంతల రాజ్‌కుమార్, తాటికాయల వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



కొడకండ్ల: మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మల్లన్నకు గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న రవిశంకర్

స్టేషన్‌ఘన్‌పూర్: నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలు బ్లాక్‌మెయిలర్‌కు, మేథావికి మధ్య పోటీయని, చీటర్, బ్లాక్‌మెయిలర్ అయిన తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులు తగిన గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ కోఆర్డినేటర్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న మోసగాడని, రాష్ట్రంలో అబద్దపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో కేసీఆర్ సమర్థవంతమైన పాలన అందించాలన్నారు.విజ్ఞులైన పట్టభద్రులు ఆలోచించి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు.

మోసపూరిత కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి: మాజీ ఎమ్మెల్యే రాజయ్య

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మోసపూరిత కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ప్రశ్నించే గొంతుకను చట్టసభలకు పంపాలని, బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్, నాయకులు తాటికొండ సురేష్, కనకం గణేష్, పొన్నం రంజిత్, పొన్నం రజిత, అనుమాండ్ల మల్లేశం, కుంభం కుమార్, ఒగ్గు రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పరామర్శ



నర్మెట: మండల కేంద్రానికి చెందిన పార్నంది నరసింహ మూర్తి అనారోగ్యంతో ఇటీవల శివసాన్నిధ్యాన్ని పొందారు. కాగా, రాష్ట్ర అర్చక పౌరోహిత సంఘం సభ్యులు సోమవారం మండల కేంద్రంలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢసానుభూతిని తెలిపారు. మృతుని పెద్దకుమారుడు పార్నంది నాగరాజ శర్మ జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి ప్రధాన అర్చకుడిగాను, భాగ్యనగర అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడిగాను, చిన్నకుమారుడు పార్నంది విశ్వనాథ శర్మ సంఘ సభ్యుడిగా కొనసాగుతున్నారు. పరామర్శించిన వారిలో భారత అర్చక పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు శ్రీనివాసా చార్యులు, జిల్లా అధ్యక్షుడు ఉప్పలగిరి ప్రసాదశర్మ, ప్రధాన సలహాదారు గంగు సచ్చిదానంద మూర్తి, ఉపాధ్యక్షుడు అన్నలాపురం ప్రమోద్ కుమార్ శర్మ, జిల్లా అధికార ప్రతినిధి రంగరాజు వెంకట రమణారావు, సభ్యులు ప్రయాగ నాగభూషణ శర్మ, కాచరాజు చంద్రశేఖర శర్మ తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

పాలకుర్తి: రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎల్లరాయని తొర్రూరులో పీఏసీఎస్ చైర్మన్ గోనెల మైసిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 5 ధాన్యం కొనుగోలుకు నాలుగు కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయని, మిగిలిన ఒక కేంద్రంలో మాత్రం 700 బస్తాల ధాన్యం ఉన్నాయని వాటిని కూడా కొనుగోలు చేస్తామని తెలిపారు.

అన్నదానం




జనగామ రూరల్: పట్టణానికి చెందిన అలసేరి శృతి జయంతిని పురస్కరించుకొని సోమవారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా శృతిని స్మరించుకున్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపకుడు మణి, టీం సభ్యులు మహేష్, కార్తీక్, సాయి, నరేష్, అజయ్, అఫ్రోజ్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తిచేయాలి



బచ్చన్నపేట: గ్రామాల్లోని ప్రభుత్వ స్కూళ్లల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లోని చేపట్టిన అభివృద్ధి పనులను, పల్లె ప్రకృతివనాలు, వన నర్సరీలను ఆయన పరిశీలించి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేయాలి



చిల్పూరు: ఎంపీ ఎన్నికల్లో ఎలా పనిచేశారో ఇక నుంచి జరిగే ప్రతీ ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేయాలని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ పిలుపునిచ్చారు. హనుమకొండలో మండలానికి చెందిన బీజేపీ నాయకులు రమేశ్‌ను సోమవారం కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి గెలుపునకు కృషిచేయాలని రమేశ్ అన్నారు. సుదర్శన్, ఉపేందర్ యాదవ్, ప్రవీన్, వెలిశాల శ్రీని ఉన్నారు.

జగన్ సీఎం కావాలని రక్తదానం



రక్తదానం చేస్తున్న ప్రవీణ్

బచ్చన్నపేట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి ఏపీ సీఎం కావాలని మండలంలోని లింగంపల్లి గ్రామ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బొడ్డు ప్రవీణ్ రక్తదానం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టి అధికంగా ఓట్లు వేశారని, జూన్ 4న వెలువడే ఫలితాల్లో అత్యధిక స్థానాలను భారీ మెజార్టీతో గెలువడం ఖాయమన్నారు.

న్యాయం చేయండి



వినతిపత్రం అందజేస్తున్న రాజ్‌కుమార్

చిల్పూరు: తనకు తెలియ కుండా అక్రమంగా చేసుకున్న భూరిజిస్ట్రేషన్‌ను వెంటనే రద్దు చేసి న్యాయం చేయాలని మండల కేంద్రానికి చెందిన బోళ్ల రాజ్‌కుమార్ సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు మండల కేంద్రానికి చెందిన రాజ్‌కుమార్ సోమవారం తహసీల్దార్ సరస్వతికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఇటీవల తన భార్యతో గొడవలు జరుగగా ఆమె వెళ్లి పోయిందని, అనంతరం ఆమె పేర ఉన్న భూమిని తనకు తెలియకుండా పట్టాదారు పాసు పుస్తకం, డాక్యుమెంట్లు లేకుండా తహసీల్దార్ ఈనెల 18వ తేదీన ఎకరం 24 గుంటలు హనుమకొండ జిల్లా కాజీపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన తొట్టి సతీష్‌కు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని ఆరోపించాడు. పట్టాదారు పాసుపుస్తకం బ్యాంకులో పెట్టి క్రాప్ లోన్ తీసుకోవడం జరిగిందని, పుస్తకం బ్యాంకులో ఉండగా మరో వ్యక్తికి ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని అన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరేందుకు కార్యాలాయానికి వెళ్లగా అందుబాటులో లేరు.

వరి కొయ్యలను కాల్చొద్దు



రఘునాథపల్లి: అవగాహన కల్పిస్తున్న కళ్యాణి



దేవరుప్పుల: అవగాహన కల్పిస్తున్న సాగర్

రఘునాథపల్లి: పంట తీశాక వరి కొయ్యలను కాల్చొద్దని, అలాగే ఉంచితే నేలలో భూసారం పెరిగి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఏఈఓ కళ్యాణి అన్నారు. సోమవారం మండలంలోని అశ్వరావుపల్లిలో వరి కొయ్యలను దహనం చేయడం ద్వారా కలిగే నష్టాలపై ఆమె రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ వరి కోశాక కొయ్యలను దహనం చేయడంతో భూమిలో సేంద్రియ పదార్థాలు, నత్రజని, పాస్ఫరస్, పొటాషియం వంటి పోషకాలు తగ్గుతాయన్నారు. అధిక ఉష్ణోగ్రత వలన పంటకు ఉపయోగపడే సూక్ష్మ జీవులు చనిపోతాయని, తద్వారా దిగుబడి తగ్గుతుందన్నారు. వరి కొయ్యలు నేలలో కుళ్లిపోవడంతో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన పంటలు పొందవచ్చని ఆమె పేర్కొన్నారు.

దేవరుప్పులలో..

దేవరుప్పుల: వరి పంట సాగు చేసిన క్షేత్రాల్లో వరికోయ్యల(దుబ్బుల)ను కాలిస్తే బహుళ నష్టాలను చవిచూస్తారని వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక పెద్దమడూరు చెరువు పూడిక ప్రాంతంలో రైతులకు వేర్వేరుగా వరిపంట కోసిన తదుపరి చెరువు మట్టి తర లింపు, సేంద్రియ ఎరువు తయారీ విధానంపై ఏఈఓలు సాగర్, భాస్కర్ అవగాహన కల్పించారు.



పాలకుర్తి: ఈరవెన్నులో..

ఈరవెన్నులో..

పాలకుర్తి: పంటపొలాల్లో వరికొయ్యలను, ఇతర వ్యర్థాలను కాల్చొద్దని వ్యవసాయ సహాయ సంచాలకులు ఆజ్మీరా చందులాల్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని ఈరవెన్ను గ్రామాన్ని ఆయన సందర్శించి రైతులకు అవగాహన కలిగించారు. చెరువులో తోడిన మట్టిని భూమిలో వేయడంతో భూమి సారవంతమవుతుందని అన్నారు. ఏఈఓ బి. శ్రావణి, రైతులు అనుమల కుమార్, సరిత, వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయం'



జనగామ: కరపత్రాలతో అఖిల్ పాషా తదితరులు



దేవరుప్పుల: చిన్నమడూరులో..


జనగామ: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నకు గ్రామ గ్రామాన ప్రతి ఒక్కరూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తీన్మార్ మల్లన్న టీం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అఖిల్ పాషా కోరారు. మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి అధ్యక్షతన సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్వల నర్సింగ్‌రావు, జిల్లా యూత్ అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్, బడికె కృష్ణస్వామి, దాసరి శేఖర్, ఎదునూరి రవీందర్, కృష్ణ, చిరంజీవి, ప్రభాకర్, ప్రకాశ్, రఘు, ప్రవర్దన్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను పట్టాభద్రులు ఆదరించి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. నాయకులు పాల్గొన్నారు.

తీన్మార్‌కు మద్దతు పలకండి

దేవరుప్పుల: ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచిన ప్రజాగళం తీన్మార్ మల్లన్నకు పట్టభద్రులు మద్దతు పలకాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఈరెంటి విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని చిన్నమడూరులో మల్లన్న గెలుపు ఆవశ్యకతపై కరపత్రాలను ఆయన ఆవిష్కరించి ప్రచారం చేపట్టారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,గ్రామ పార్టీ అధ్యక్షులు వంగ దశరథ, రాంపల్లి పరమేష్ వాసర్ల వీరస్వామి దుబ్బాక శ్రీనివాస్ గౌడ్ బెజగం పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న వేద పండితులు

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండలో లక్ష్మినరసింహస్వామి ఆలయంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం వేద పండితులు కృష్ణమాచార్యులు, కె.కళ్యాణ్‌స్వామి, ఆలయ అర్చకులు కేవీజీకే ఆచార్య, వీరరాఘవాచార్యస్వామి, శ్రీనివాసాచార్యస్వామి, తోయప్పన్‌అచార్యస్వామి, అనంత్‌స్వామి, గోవిందంస్వామి మంత్రోచ్చరణలతో అగ్ని ప్రతిష్ఠ, ద్వార తోరణ ధ్వజ కుంభారాధనలు, ధ్వజారోహణం, భేరిపూజ, దేవతాహ్వనం నిర్వహించారు. గ్రామస్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఘనంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం, శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భగవత్కృతకు పాత్రులు కాగలరని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు పీఏసీఎస్ చైర్మన్ గంగిడి నర్సింహారెడ్డి, ఆలయ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సుధీర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన తాటికాయల రామక్క అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. కాగా బాధిత కుటుంబాన్ని వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. రామక్క మృతిపట్ల ప్రగాఢ సంతాపం తెలిపి రూ.5వేలు సాయం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు మారపాక రాములు, ఎడమ కట్టమల్లు, యాదగిరి, రాజయ్య, శ్రీనివాస్, మనోహర్, సమ్మయ్య, సంపత్, మహేందర్, నాగేష్, అనీల్, రవి తదితరులు ఉన్నారు.

ఆంజనేయుడి విగ్రహానికి క్షీరాభిషేకం



కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్‌లోని దక్షిణముఖ అభయాంజనేయుడి విగ్రహానికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాసశర్మ 108లీటర్ల ఆవుపాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తీసుకొచ్చిన నదీ జలాలతో స్వామివారిని అభిషేకించారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అనగం యాదగిరితో పాటు సభ్యులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనానికి వెళ్లేదెట్లా..?

లింగాలఘణపురం: జిల్లాలోనే ఉత్తమ పల్లె ప్రకృతి వనంగా పేరుగాంచిన మండలంలోని నెల్లుట్ల పల్లె ప్రకృతి వనానికి వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. పది ఎకరాల్లో వందలాది పండ్ల మొక్కలు, ఇతర మొక్కలతో వెలసిల్లి రాష్ట్ర వ్యాప్తంగా పేరుపొందిన పల్లె ప్రకృతి వనానికి వెళ్లే దారి గత ఏడాది కురిసిన భారీ వర్షాలతో పైపులు కొట్టుకుపోయి సీసీ పూర్తిగా ధ్వంసమైంది. పైపుల పైనుంచి ఏర్పాటు చేసి సీసీ కొట్టుకుపోయి బిల్లలుగా విరిగిపడింది. దీంతో అటు వైపు వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. తాత్కాలికంగా ఊరి అవతల నుంచి మరో దారిలో వెళ్తున్నారు. వర్షాలు కురిస్తే నీరు ప్రవహించి ఆ దారి కూడా నడిచేందుకు వీలు లేకుండా పోతోంది. అంతేకాకుండా వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రైతులు కూడా ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాల సీజన్ మొదలవుతుండడంతో నెల్లుట్ల చెరువు మత్తడి పోస్తే ఇక అటు వైపు వెళ్లేందుకు ఏమాత్రం అవకాశం ఉండదు. దీంతో నర్సరీలో పెంచే మొక్కలను కూడా తీసుకెళ్లేందుకు వీలు లేకుండా పోతుంది. ఇప్పటికైన అధికారులు స్పందించి మరమత్తులు చేపట్టాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



వర్షాలకు ధ్వంసమై కొట్టుకుపోయిన సీసీ రోడ్డు